క్లుప్తంగా

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ కోరారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో సీపీఎం గ్రామ మహాసభను గురువారం నిర్వహించారు. పార్టీ మండల నాయకులు మంద మహేందర్, మ్యాదరబోయిన కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నిరుపేదలకు రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నార న్నారు. రుణమాఫీ కాని రైతులకు మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు గట్ల కొండల్‌రెడ్డి, రాపర్తి రాజు, సోమయ్య, మండల కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి అభివృద్ధికి పట్టం కడుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇరుగు ప్రకాష్, శ్రీరాములు, అరుణ్, రణధీర్, కిషన్‌లు పార్టీలో చేరారు. దయాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, మదన్‌మోహన్, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

డిక్షనరీల పంపిణీ

జఫర్‌గఢ్: మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కాంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ డిక్షనరీలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులకు డిక్షనరీలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉచితంగా డిక్షనరీలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి సాంబరాజు, హోప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాజిరెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధి ఎల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

చిల్పూరు: నవంబర్ 4వ తేదీన మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద నిర్వహించనున్న సీపీఎం 3వ మహాసభను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి సాదం రమేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో గురువారం మహాసభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాం పరమేష్, పోలు సంపత్, సాదం శ్రీనివాస్, గద్ద కుమార్, పోలు శ్రీనివాస్, సాదం రాజు, ఊరడి రవి, రామరాజు, మల్లయ్య, భిక్షపతి, ఐలయ్య, భీమయ్య పాల్గొన్నారు.

సముచిత స్థానం కల్పించండి

జనగామ రూరల్: దశాబ్దాల కాలంగా కాంగ్రెస్‌ను నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని న్యాయవాది, మైనార్టీ, సీనియర్ నాయకులు జమాల్ షరీఫ్ కోరారు. ఈమేరకు గురువారం ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్యశిబిరం

జనగామ రూరల్: పట్టణంలోని స్థానిక వీవర్స్ కాలనీలో ప్రజలకు జనగామ డిస్ట్రిక్ట్ క్యాంపు కో ఆర్డినేటర్ జహంగీర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ లేబర్ కార్డు ఉన్న వారికి గురువారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ రూ.10వేల ఖర్చు వరకు 50రకాల టెస్టులు రాష్ట్ర ప్రభుత్వం లేబర్ కార్డు ఉన్న వారికి ఉచితంగా అందిస్తుందన్నారు. 200 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. క్యాంపు నిర్వాహకుడు, సీఎస్‌సీ వరంగల్ డివిజన్ మేనేజర్ రామంచ సుమన్, స్థానికులు పాల్గొన్నారు.

పాము కాటుతో వృద్ధురాలి మృతి



కేతవ్వ(ఫైల్)

నర్మెట: మండలంలోని అమ్మాపూర్ గ్రామానికి చెందిన గుండెల్లి కేతవ్వ (60) తన వ్యవసాయ బావి వద్ద పత్తి చేనులో గురువారం పత్తి ఏరుతుంది. పనిలో నిమగ్నమైన కేతవ్వను పాము కాటు వేయగా భర్త కొమురెల్లికి చెప్పే క్రమంలో స్పృహతప్పి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది.

వివాహిత అదృశ్యం



సుమలత

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని యాపలబోడ్‌తండాకు చెందిన వివాహిత బాదావత్ సుమలత అదృశ్యమైనట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ గురువారం వెల్లడించారు. తండాకు చెందిన సుమలత భర్త లింగంతో కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేది. కాగా, ఈనెల 19న తెల్లవారు జామున ఇంట్లో నుంచి సుమలత ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు సమీప బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించకపోవడంతో భర్త లింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రహదారి అధ్వానం

- అడుగుకో గుంత.. ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



అధ్వానంగా ఉన్న ఖిలాషాపూర్-మాదారం రోడ్డు



రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

రఘునాథపల్లి: మాదారం నుంచి ఖిలాషాపూర్ వెళ్లే రెండు కిలోమీటర్ల మట్టి రోడ్డు అడుగడుగునా గుంతలమయమై అధ్వానంగా మారింది. రహదారిపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడినా పట్టించుకునే నాథుడే లేరని వాపోతున్నారు. కనీసం మరమ్మతులైనా చేయించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. గుంతలమయమైన రోడ్డుపై ఆటోలు, బైకులు కూడా వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలిచి వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గుంతల కారణంగా రాత్రి సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాగుపై బ్రిడ్జి లేక కష్టాలు

మాదారం నుంచి ఖిలాషాపూర్ వెళ్లే వాగుపై బ్రిడ్జి లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఖిలాషాపూర్ చెరువు మత్తడి పోసినా మాదారం గ్రామస్తుల రాక పోకలు నిలిచి పోతున్నాయి. బ్రిడ్జి నిర్మించి ప్రజలు కష్టాలు తీరుస్తామన్న నేతల హామీలు అమలుకు నోచు కోవడం లేదు. మాధారం, సోమయ్యకుంటతండాకు చెందిన విద్యార్థులు వర్షాకాలంలో నీళ్లలోంచే వాగు దాటు కుంటూ వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే వివిధ గ్రామాలతో పాటు అయా మండలాలు, జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు అనువుగా ఉంటుంది. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణంతో పాటు, బీటీ రోడ్డు మంజూరి చేయాలని అయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మిస్తే కష్టాలు తీరుతాయి



మాదారం వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే అందరి కష్టాలు తీరుతాయి. మా గ్రామ పిల్లలు నిత్యం చదువు కోసం ఖిలాషాపూర్ వెళ్తుంటారు. వర్షాకాలంలో వాగు పారితే పాఠశాల బంద్ కావాల్సిందే. దశాబ్దాలుగా ఖిలాషాపూర్‌కు బీటీ రోడ్డు నోచుకోవడం లేదు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి బ్రిడ్జి, బీటీ రోడ్డు మంజూరు చేయాలి.

\- బాల్నె గట్టుమల్లయ్య, మాదారం

ఎవరూ పట్టించుకోవడం లేదు



ఖిలాషాపూర్ నుంచి మాధారం వెళ్లేందుకు బీటీ రోడ్డు లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మధ్యలో వాగుపై బ్రిడ్జి నిర్మించాలని పలు మార్లు కోరినా ఫలితం లేదు. త్వరగా బీటీ వేసే విధంగా చర్యలు చేపట్టాలి.

\- శివరాత్రి రాములు, ఖిలాషాపూర్

కాలానుగుణంగా పరిజ్ఞానం పెంచుకోవాలి



ట్రెయినర్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

జనగామ: విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా విషయ అవగాహన, బోధన పద్ధతులు, పరిజ్ఞానం పెంచుకోవాలని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సీజేఐటీలో మొదటి సంవత్సరం చదువుకుంటున్న బీటెక్ విద్యార్థులకు ఓరియంటేషన్, ఉద్యోగ నైపుణ్యం ఎలా పెంచుకోవాలనే దానిపై రెండు రోజుల అవగాహన సదస్సును డైరెక్టర్ ప్రారంభించారు. అనంతరం ట్రెయినర్ ఇన్స్పిరేషన్, మోటివేషన్ కోచ్ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యోగ నైపుణ్యం, కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ మారుతున్న సమాజంలో విద్యార్థులు జీవితంలో ఎదిగేందుకు ఈ సదస్సు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి సదస్సులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఎస్సై



హసన్‌పర్తి: పాలకుర్తి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పవన్ కుమార్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి మొక్క అందజేశారు.

శివలింగానికి ప్రత్యేక పూజలు



చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బండలగట్టు శివ గంగేశ్వరి ఆలయంలో గురువారం శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణ దాత, అర్చకుడు వేల్పుల లక్ష్మిగట్టయ్య, భక్తులు పాల్గొన్నారు.

విజయదుర్గా ఆలయంలో తిరుగువారం



పూజలు చేస్తున్న భక్తులు



విజయదుర్గామాతకు హారతి ఇస్తున్న పూజారి

జనగామ: జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంట విజయదుర్గామాత ఆలయంలో నాలుగు రోజుల పాటు జాతర వేడుకలు జరుగగా, గురువారం తిరుగు వారం పండగను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ఆరాధ్యశర్మ మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దుర్గామాతను దర్శించుకుని, ఓడి బియ్యం పోసి కట్నకానులను సమర్పించారు.



అమ్మవారికి ఒడిబియ్యం పోస్తున్న మహిళలు



పట్నం వద్ద ఒగ్గుపూజారులు

హర్షం

పాలకుర్తి: జిల్లా ఆర్య వైశ్య మహాసభ నూతన కమిటీలో పాలకుర్తి మండలానికి పెద్దపీట వేయడంపై సంఘం మండల అధ్యక్షుడు చిదర జగదీశ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన పాలకుర్తిలో మాట్లాడారు. జిల్లాలో అన్ని మండలాల కన్నా పాలకుర్తికి చెందిన వారికి ఎక్కువ పదవులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగమళ్ల సోమేశ్వర్, కోశాధికారి దొడ్డ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చిల్పూరులో పులి కలకలం

- ఆధారాలు లేవన్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్



పులి జాడ కోసం గాలిస్తున్న ఫారెస్టు సిబ్బంది

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట సమీపంలో పులి కలకలం సృష్టించింది. గురువారం తెల్లవారు జామున పులి కనిపించిందంటూ రైతులు భయాందోళనకు గురై వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న అధికారులు ఆధారాలు సేకరించారు. పులి అడుగు జాడలు కనిపించకపోవడంతో భయాందోళన చెందొద్దని రైతులకు భరోసా కల్పించారు. చిల్పూరుకు చెందిన మూల నాగరాజు, నారగోని రాజ్‌కుమార్, కుందేళ్ల రవి ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్తుండగా వారికి పులిని పోలిన జంతువు కనిపించింది. దీంతో వారు ఒక్కసారిగా అరవడంతో ఆ జంతువు గుట్ట వైపు పారిపోయింది. వెంటనే ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ జరీనాకు సమాచారం ఇవ్వగా సిబ్బందితో వెంటనే చేరుకున్న ఆమె.. రైతులు చెప్పిన ప్రదేశాల్లో జంతువు అడుగు జాడల కోసం పరిశీలించారు. జాడలు కనిపించక పోవడంతో పులి కాదని నిర్ధారించారు. హైనాకు కూడా మచ్చలు ఉంటాయని, మనుషుల అరుపులు వింటే వెంటనే పారిపోతుందన్నారు. దీనిపై భయాందోళన వద్దన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు చింత అంజయ్య, మురళీధర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొడకండ్ల: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన అర్చకులు శ్రీనివాసచార్యులు, లక్ష్మణాచార్యుల తల్లి సౌందర్యమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకొంటున్న అభిమన్‌గాంధీనాయక్‌ను కూడా దయాకర్‌రావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, సొసైటీ వైస్ చైర్మన్ సోమరాములు, నాయకులు కృష్ణమూర్తి, రణధీర్, మల్లేష్, యాకూబ్, తుకారాం ఉన్నారు.

సంతాపం

మండలంలోని ధర్మాపురం, పెద్దమడూరులో పోతుగంటి సోమనర్సమ్మ, దూడల సోమయ్య మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబాలను గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరులో గుండెపోటుతో దూడల సోమయ్య మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ జిల్లా యువజన నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ దాతృత్వంతో నాయకులు రూ.10 వేలను అందజేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పుల: ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు


వడ్డెగూడెంలో..

జఫర్‌గఢ్: మండలంలోని జఫర్‌గఢ్ గ్రామ శివారు వడ్డెగూడేనికి చెందిన ఇల్లందుల ఐలయ్య, ఇల్లందుల బొందమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ బృందంతో కలిసి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులనుపరామర్శించారు. అనంతరం ఐలయ్య కుటుంబానికి బియ్యం అందజేశారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయాలి

జఫర్‌గఢ్: విద్యుత్ బకాయిలను త్వరగా వసూలు చేయాలని విద్యుత్ సహాయ గణాంక అధికారి (ఏఏ) రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ బకాయి వసూళ్లపై సంబంధిత అధికారులతో ఏఓ ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం బకాయిలు పెండింగ్‌లో ఉన్న విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి కొందరికి నోటీసులు జారీ చేశారు. ఏఈ విశ్వసాయితీ, లైన్‌ఇన్‌స్పెక్టర్ కాల్రామ్, ఆర్‌సీ సాయిలు, ప్రభాకర్, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అనిల్‌రెడ్డి

బచ్చన్నపేట: రైతులు ఆరు గాలాలు కష్టించి పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించి మోసపోవొద్దని మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నారాయణపురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి, సీసీ తిరుమల, కార్యదర్శి దేవీ ప్రసాద్, నాయకులు పరిదె శ్రీనివాస్, వీఓ అధ్యక్షురాలు జంగిటి కమల, మంజుల, లక్ష్మి, దేవేంద్ర, కనకలక్ష్మి, లావణ్య, ప్రేమలత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



మల్లారెడ్డి



జి.శ్రీనివాస్

బచ్చన్నపేట: టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని మండల కేంద్రంలోని సెకండరీ పాఠశాలలో గురువారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు నిర్వహణాధికారిగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, అంకుషావళి పాల్గొన్నారు. మండల అధ్యక్షుడిగా కడుదూరి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుంటిపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా యాదగిరి, వెంకటలక్ష్మి, భాస్కర్, నర్సింహారెడ్డి, కార్యదర్శులు వెంకటనర్సింహారెడ్డి, ప్రభాకర్, యాకూబ్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా యాదగిరి, కవిత, ఆడిట్ కమిటీ సభ్యులుగా నర్సింహాస్వామి, రమేష్, స్వరాజ్, అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా యాదగిరి, ఐలయ్య, కృష్ణమోహన్ తదితరులను ఎన్నుకున్నారు.

నియామకం

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ గ్రామానికి చెందిన ఇల్లందుల సారయ్యను ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రడపాక ప్రదీప్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. సారయ్య పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని ఆయన సేవలను గుర్తించి పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగిందన్నారు. ఆయనతో పాటు జఫర్‌గఢ్ గ్రామానికి చెందిన గద్దం లింగస్వామిని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆయన తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతూన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: నియజకవర్గ అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఐటీడీఏ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో లింగ్ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలపై ప్రత్యే దృష్టి పెట్టాలన్నారు. ఇరిగేషన్ శాఖ ఈఈలు రమేష్ బాబు, ప్రవీణ్,డీఈలు శ్రీకాంత్‌శర్మ, సునీల్, పూర్ణ చందర్, పంయతీరాజ్ శాఖ డీఈ రామలింగాచారి, తహసీల్దార్ శ్రీనివాస్, ఐటీడీఏ ఏఈ పుల్లయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పల మండలాల అధ్యక్షులు, అయా శాఖల ఏఈలు పాల్గొన్నారు.

గీతకార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గీత కార్మికుల వృత్తిలో సురక్షితమైన జీవితాన్ని అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కాటమయ్య సేఫ్టీ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే మామిడాల యశస్విరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య సెఫ్టీ మోకులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రవీందర్, ఎక్సైజ్ సీఐ సంతోష్‌రెడ్డి, ఎస్సై పద్మ, గీత కార్మిక సంఘాల నాయకులు మూల వెంకటేశ్వర్లు, మూల మహేష్‌గౌడ్, మోలుగురి యాకయ్య, బండి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు కృషి

పాలకుర్తి: పాలకుర్తి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ, జిల్లా సహాయ కార్యదర్శులు మామిడాల రమేశ్, యాకన్న, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న ఏసీపీ పార్థసారథి

జనగామ రూరల్: బ్యాంకుల్లో తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అప్పుడే నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని ఏసీపీ పార్థసారథి అన్నారు. గురువారం ఏసీపీ కార్యాలయ ఆవరణలో జిల్లాలోని వివిధ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో తగుజాగ్రతలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. సీఐ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరగా పరిశీలించాలి



జీపీ అధికారులకు సూచనలిస్తున్న విజయశ్రీ

స్టేషన్‌ఘన్‌పూర్: భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఎల్‌ఆర్‌ఆర్ దరఖాస్తుల పరిశీలనను గ్రామ పంచాయతీ అధికారులు త్వరితగతిన చేపట్టాలని ఎంపీడీఓ విజయశ్రీ అన్నారు. డివిజన్ కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీఓ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన ప్రక్రియ ఎలా చేస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. మొబైల్ యాప్ ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను సమగ్రంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓ లింగయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న తాళ్లపల్లి కుమార్

నర్మెట: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బిచ్చాల వంశీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు రూ. 4వేలు ఉన్న పింఛన్‌ను రూ. 6వేలు పెంచుతామని హామీ ఇచ్చారని అన్నారు. పలు సమస్యలపై నవంబర్ 26న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిర్రు నాగేష్, జిల్లా కన్వీనర్ గద్దం సోమరాజ్, ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు కంతి చరణ్, ఇరుగు కృష్ణమూర్తి, గంగరబోయిన నారాయణ, కళ్యాణం రాజు, గోపగోని శ్రీనివాస్, కుమార్, శివరాత్రి రవి, కొంపెల్లి వెంకటయ్య, శ్రీనివాస్, బానోత్ భీమా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చరణ్‌మాదిగ

నర్మెట: ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కంతి చరణ్‌కుమార్ మాది గను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ మాదిగ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పార్టీలో గత 15 సంవత్సరాలుగా క్రియాశీలకంగా పని చేసినందుకు తగిన గుర్తింపు లభించిందన్నారు. తనకు పదవీ రావడానికి కృషి చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం మండల కార్యదర్శిగా అంజయ్య

లింగాలఘణపురం: మండలంలోని వడిచర్లకు చెందిన గండి అంజయ్యను సీపీఎం మండల కార్యదర్శిగా ఎన్నుకున్నారు. గురువారం వడిచర్లలో సీపీఎం మండల ముఖ్యనాయకులు సమావేశం బొడ్డు కరుణాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. గండి అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కరుణాకర్, సత్తయ్య, శ్రీనివాసు, మల్లయ్య ఉన్నారు.

యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా రాజేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన మంద రాజేందర్‌యాదవ్‌ను నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకటేష్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇప్పగూడెంలో రాజేందర్ యాదవ్ విలేకరులతో మాట్లాడారు. మండలంలో యాదవుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

'ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుంటే యుద్ధమే'

జనగామ రూరల్: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేయని పక్షంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై యుద్ధం తప్పదని ఎమ్మార్పీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఉపేందర్ హెచ్చరించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీలో జరిగిన మాదిగ విద్యార్థుల రాష్ట్రస్థాయి సదస్సుకు ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గండమల్ల కిరణ్ ఆధ్వర్యంలో తరలి వెళ్లే క్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తరలివెళ్లిన వారిలో ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, నాయకులు మధు, నవీన్, అజయ్, రాజు, మహేష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలి శ్రీనివాస్‌ను ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా నాయకుడు మొగ్గుంపురం కిషోర్‌కుమార్ గురువారం ఘన్‌పూర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. అమరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యతను పాటించాలి

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించాలని పంచాయతీ కార్యదర్శులు బ్యాంగి రూపాచైతన్య, భరత్‌కిషోర్ అన్నారు. గురువారం మండలంలోని కొడవటూర్, బండనాగారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని వారు పరిశీలించారు. పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.